ప్రభుత్వ రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రాయితీ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బేస్తవారిపేట : రైతులు ప్రభుత్వం అందించే రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. బేస్తవారిపేట రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రాయితీ పప్పు శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, సర్పంచ్ బి ఆశ్రీత జ్యోతి, జడ్పీటీసీ బి.వెంకట రాజు, వైస్ ఎంపీపీ డి.ఖాజామియా, ఎంపీటీసీ జి. స్వప్న, మండల వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ, సిబ్బంది, వైసీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ప్రకాశం, బాపట్ల జిల్లాలు

మంత్రి సురేష్‌కు నేతల పరామర్శ

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను మంగళవారం శాసన మండలి చైర్మన్ కే.మోషేన్ రాజు పరామర్శించారు. మంత్రి సురేష్‌కు మోకాలు శస్త్రచికిత్స జరిగి సోమాజిగూడలోని యశోద హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసిన చైర్మన్ శస్త్ర చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రకాశం జిల్లా చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, ఆయన కుమారుడు వెంకటేష్‌తో కలసి మంత్రి సురేష్‌ను పరామర్శించారు.

స్టాంప్ డిజైన్ కాంపిటేషన్

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : స్థానిక వాసవి విద్యానికేతన్‌లో ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో భాగంగా పోస్టర్ అండ్ డిపార్ట్‌మెంట్ వారు నిర్వహించిన స్టాంప్ డిజైన్ కాంపిటేషన్ మంగళవారం జరిగింది. ఈ పోటీలలో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు జాతి సమైక్యత ప్రతిబింబించేలా విద్యార్థులు గీసిన చిత్రాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ డివిజనల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రిన్సిపల్ రంగయ్య ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం స్కూల్ లెవల్‌లో ప్రత్యేక ప్రతిభ కనిపరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ రంగయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రంజిత్‌కుమార్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం

- మరో రెండు రోజులు వర్ష సూచన
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు :
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి రాత్రి వరకు చలిగాలులు వీస్తుండటంతో పాటు చిరు జల్లులు పడుతున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో చెరువులు, వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. గుండ్లకమ్మకు వరదనీరు వచ్చి చేరింది. ముందస్తు వేసిన పంటలకు కొంతమేర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రత్తి, కంది, మిర్చి పంటలకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచివుంది. జిల్లా వ్యాప్తంగా 80 వేల హెక్టార్లలో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. రబీ సీజన్ కూడా రైతులు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధికారులను అప్రమత్తం చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాల్లో ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటు పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీవర్షపాతం నమోదైంది. ఉదయం 8 గంటల నుంచి స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు వర్షం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో రెండు రోజుల పాటు వర్షం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

విశాలాంధ్ర-బేస్తవారిపేట : వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికీ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. బేస్తవారిపేట పట్టణంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా గ్రామంలోని ప్రతి గడప - గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తుందని, ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోమౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తూ రూ.20లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంబాబుకు యాపిల్ గజ మాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జడ్పీటీసీ బండ్లమూడి వెంకటరాజు, సర్పంచ్ ఆశ్రీత జ్యోతి, ఉప సర్పంచ్ మట్టా రమేష్, వైసీపీ నాయకులు ప్రేమానంద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోండి

- బకాయిలు రాక అల్లాడుతున్న బాధితులు
- రూ.10వేలతో ఆపేసిన చెల్లింపులు
- ఏళ్లతరబడి ఎదురుచూపులు

అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ నిరసన ర్యాలీ

తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

విశాలాంధ్ర - శింగరాయకొండ : అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలంటూ మరోసారి ఉద్యమం ఆరంభమయింది. గత సంవత్సరం పదివేల రూపాయలలోపు బకాయిలను చెల్లించిన ప్రభుత్వం ఆతరువాత ఈవ్యవహారంలో బాధితులకు తదుపరి చెల్లింపులను ప్రారంభించలేదు. వాస్తవానికి పదివేల లోపు నష్టపోయిన వారికంటే మిగిలిన వారే అధికంగా ఉన్నారు. జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తిరిగి చెల్లింపులు లప్రారంభించి మిగిలిన వారికి కూడా చెల్లింపులు చేపట్టాలంటూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. బకాయిల చెల్లింపు విషయంలో చొరవ చూపాలంటూ ఈ అసోసియేషన్ నాయకులు శింగరాయకొండ తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తదుపరి చెల్లింపులు తక్షణం చేపట్టాలంటూ అసోసియేషన్ అధ్యక్షులు వి.తిరుమలరావు డిమాండ్ చేశారు. గత సంవత్సరం 10వేల లోపు బకాయిలను ప్రభుత్వం చెల్లించిందని, అయితే ఆసంఖ్య పరిమితమని ఆయన పేర్కొన్నారు. ఈచెల్లింపులు కొనసాగిస్తేనే అధికమందికి న్యాయం చేసినట్లు అవుతుందని ఆయన పేర్కొన్నారు. కనీసం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ సంవత్సరం ఇరవై వేలలోపు చెల్లింపులను ఆరంభించాలన్నారు. కేవలం చెల్లింపులే కాకుండా స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు, డిపాజిట్లు చేసిన వారి సంఖ్య కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారని అసోసియేషన్ కొండెపి నియోజకవర్గ నాయకులు కె.వీరారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఈబకాయిల విషయం గుర్తు చేయాలన్న ఉద్దేశ్యంతో అన్ని ప్రాంతాల్లోనూ నిరసన ర్యాలీలు ఆరంభిస్తున్నామని, ప్రభుత్వం చెల్లింపులు ఆపకుండా చివరి వరకు బాధితులకు చెల్లింపులు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పలు పోరాటాల అనంతరం ముఖ్యమంత్రి జగన్ ఈవిషయంపై హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో నాయుడు శ్రీనివాసరావు, రమణయ్య, చంద్రశేఖర్, జాకీర్‌హుసేన్ ఉన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు :
పొట్టి శ్రీరాములను ఆదర్శంగా తీసుకొని ప్రజలంతా ముందుకు సాగాలని ఒంగోలు శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా యంత్రాంగం మంగళవారం ఘనంగా నిర్వహించింది. సి.వి.ఎన్. రీడింగ్ రూమ్ కూడలిలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టరు ఏ.ఎస్. దినేష్ కుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ శ్రీమతి గంగాడ సుజాత, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం అభిషిక్త్ కిషోర్, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్య నారాయణ, శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కుప్పం ప్రసాద్ లు పుష్పమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి అభినందనీయమని శాసన సభ్యులు శ్రీనివాసరెడ్డి చెప్పారు. తెలుగు ప్రజల కోసం 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఆయన ప్రాణ త్యాగంతోనే భాషా ప్రయుక్త రాష్ట్రంగా తమిళనాడు నుంచి ఏ.పి. విడిపోయిందన్నారు. ఆయన పోరాట పటిమని ఆనాటి ముఖ్యమంత్రి దివంగత వై.ఎస్.రాజశేఖర రెడ్డి గుర్తించి నెల్లూరు జిల్లాకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నామకరణం చేశారని ఆయన గుర్తు చేశారు. జిల్లా కలెక్టరు ఏ.ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. తమిళనాడులో మిళితమైన తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ నిరాహార దీక్ష చేశారని గుర్తు చేశారు.

తెలుగు ప్రజలంతా స్వేచ్ఛగా జీవించడానికి కారణం అమరజీవి పొట్టి శ్రీరాములేనని ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ శ్రీమతి గంగాడ సుజాత తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించడం సంతోష దాయకమని శాసనమండలి సభ్యురాలు శ్రీమతి పోతుల సునీత అన్నారు. పొట్టి శ్రీరాములు చేసిన ఉద్యమాలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.పి. కె. నాగేశ్వరరావు, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్లస్-2 విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ ఆటల పోటీలలో సీఎస్‌పురం మండలంలోని కెవియస్ఎల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు అత్యంత ప్రతిభను కనపరిచారు. వ్యక్తిగత విభాగంలో100 మీటర్లు, 400 మీటర్లు రిలే పరుగు పందెంలో, హై జంపు, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం మరియు ట్రిపుల్ జంప్ లో ద్వితీయ స్థానం సాధించి కదిరి మహేష్ జిల్లా స్థాయిలో జరిగే అండర్ 17పోటీలకు ఎంపికయ్యాడు. టెన్నికాయిట్ మరియు వాలీబాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన కొట్టే దామోదర నాయుడు కూడా ఆ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. వెంకటేశ్వర్లు, పి.జి.టిలు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులను మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు నరేష్‌ను అభినందించారు.

మానవునికి ప్రకృతితో అవినాభావ సంబంధం

సమావేశంలో సందేశం ఇస్తున్న సదానందగిరి స్వామి

విశాలాంధ్ర-పామూరు : మానవునికి ప్రకృతితో వున్న సంబంధం ఎంతో గొప్పది. ప్రకృతితో మానవునికి ఉన్న సంబంధం ఎంతో గొప్పదని శ్రీశ్రీశ్రీ సంత్ సదానందగిరి స్వామి మహారాజ్ అన్నారు. సోమవారం కార్తీక మాసం కోటి సోమవారం సందర్భంగా పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి కళ్యాణ మండపంలో హిమాలయంలో సుభవాలు ఆత్మ జ్ఞాన సందేశం అను అంశం పై కార్యక్రమం జరిగింది. అతిథులుగా 106 సంవత్సరముల వయసుగల హిమాలయ యోగి శ్రీశ్రీశ్రీ సంత్ సదానందగిరి స్వామి మహారాజ్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవునికి ప్రకృతితో అవినాభావ సంబంధం ఉన్నదని, హిమాలయాలలో 300 సంవత్సరంలకు పైగా జీవించిన వారు ఇప్పటికీ సజీవంగా ఉన్నారన్నారు. శాఖాహారం, ప్రకృతి జీవనం, ధ్యానము, దానము, పిరమిడ్ శక్తి, ఆనందము మానవునికి ఎంతో అవసరం ఇవి మానవాళికి శ్వాస మీద ధ్యాస అనే నినాదంతో సుభాష్ పత్రీజీ మానవాళికి సులభతరంగా హిమాలయ విద్యను దేశమంతటికి అందించారన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నుండి విచ్చేసిన ధ్యానరత్న వెలగపూడి లక్ష్మణరావు, నారాయణ శ్రీకాంత్, మారుతి అల్లూరయ్య, ప్రిన్సిపాల్ గుత్తి రమణయ్య, సౌభాగ్యం, దుర్గ, వాణి, సుభాషిని, మస్తానమ్మ కోడూరు ప్రభాకర్, దర్శి మనోహర్ పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకారాదు

సూర్య శ్రీ ట్రస్ట్ రూ.1.50లక్షల ఆర్థిక సాయం

హేమలతకు చెక్కును అందజేస్తున్న డాక్టర్ రాజశేఖర్

విశాలాంధ్ర-ఒంగోలు : ఆల్ ఇండియా జెఈ మెయిన్స్ పరీక్షల్లో ఒంగోలు పాత సుజాతనగర్ కు చెందిన పెరికల హేమలత 978 వ ర్యాంకు సాధించడం గర్వకారణం అని ఏషియన్ హాస్పిటల్ ఎండి బొడ్డపాటి రాజశేఖర్ అన్నారు. పెరికల హేమలతకు వరంగల్ నిట్ క్యాంపస్‌లో చేరేందుకు ఆర్థిక స్తోమత లేనందున సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష సంప్రదించగా ఎన్నారైలు చంద్ర వంగపోలు రూ.75వేలు, రామ్ బోడిపూడి రూ.25వేలు మిత్రులు పదివేలు చొప్పున ఆర్థిక సహకారంతో 1,50,000 రూపాయలు చెక్కులు సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మండవ మురళీకృష్ణ, డాక్టర్ బొడ్డపాటి రాజశేఖర్ అందజేశారు. మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాకూడదని పేరు ప్రఖ్యాతలు చెందిన ఎంతోమంది మేధావులు, మహానుభావులు పేదరికంలో పుట్టారని అటువంటి మహానుభావులు చదువుని నిర్లక్ష్యం చేయకుండా కష్టపడి చదివినందున ఈరోజు దేశం గర్వించేదగ్గ వ్యక్తులుగా ఎదిగారని అన్నారు. అందిన ఆర్థిక సహాయాన్ని జాగ్రత్తగావినియోగించుకుని ఉన్నత చదువులు చదివి అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు. ట్రస్ట్ నిర్వాహకులు సర్దార్ భాష, ట్రస్ట్ గౌరవ సభ్యులు మండవ సుబ్బారావు ,చైతన్య స్వర భారతీ అధ్యక్షుడు నూకతోటి శరత్ బాబు, నేరెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలు పొందాలి

విశాలాంధ్ర-కనిగిరి : ప్రజలు మండల న్యాయ సేవాధికార సంస్థ అందజేసే ఉచిత న్యాయ సేవలను పొందాలని న్యాయవాది కనిగిరి మున్సిపల్ చైర్మన్ అన్నారు. మంగళవారం ఆజాదిక అమృత మహోత్స వంలో భాగంగా కనిగిరి నాలుగవ సచివాలయంలోని సిబ్బందికి, వాలంటీర్లకు చట్టాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తమ్మినేని సుజాత శ్రీరామ్ రెడ్డి ,పారా లీగల్ వాలంటీర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు

లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న కృష్ణచైతన్య

విశాలాంధ్ర-అద్దంకి : గడప గడపకు కుల,మత పార్టీలు వివక్షకు తావులేకుండా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైకాపాదేనని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కృష్ణచైతన్య పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్,ఎస్తేరమ్మ, వార్డు కౌన్సిలర్ చెన్నుపల్లి రత్నకుమారి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'క్విస్' విద్యార్థినికి బంగారు పతకం

విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో పథమ సంవత్సరము ఇఇఇ చదువుతున్న టి.భార్గవి గతనెల 22నుండి 30 వరకు జెడ్‌పి హైస్కూల్ రేణిగుంట తిరుపతిలో జరిగిన రెండవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో జూనియర్ విభాగంలో రాష్ట్ర నలు మూలల నుండి వచ్చిన క్రీడాకారులతో పోటీపడి బంగారు పతకం సాధించినట్లు క్విస్ విద్యా సంస్థల చైర్మన్ నిడమానూరు నాగేశ్వరరావు, సెక్రటరీ సూర్య కళ్యాణ చక్రవర్తి ప్రకటనలో తెలియజేశారు. ఎంపికైన విద్యార్థిని రాష్ట్ర జట్టు తరఫున ఉత్తరప్రదేశ్ అయోధ్యలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనుటకు వెళుతుంది. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు, అకడమిక్ డీన్ డాక్టర్ జయలక్ష్మి, క్రీడా హెడ్ జయకృష్ణ మరియు ఇతర అధ్యాపకులు, క్రీడాకారులు అభినందించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

విశాలాంధ్ర-పామూరు : వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బొట్ల గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆశా కార్యకర్తలు, వాలంటరీస్, ఆరోగ్య కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. డాక్టర్ విజయకుమార్ సీజన్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. జ్వర పీడితులను వెంటనే వైద్యశాలకు తరలించి వైద్య సేవలను అందించేందుకు ఆశ ఆరోగ్య కార్యకర్తలు వాలంటీర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆశా కార్యకర్తలకు కిట్లు పంపిణీ చేశారు.

పాత్రికేయుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని బెడుసుపల్లి గ్రామానికి చెందిన వెబ్ ఛానల్ పాత్రికేయుడు దమ్ము తిరుపతికి పక్షవాతం సోకి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విలేజ్ ఫోర్స్ టీం అధ్యక్షుడు శశి కుమార్‌రెడ్డి లోకల్ పాత్రికేయుల సహకారంతో పక్షవాతం సోకి ఇబ్బందులు ఎదుర్కొంటున్న తిరుపతికి 12,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. లోకల్ పాత్రికేయుల సహాయ సహకారంతో లోకల్ పాత్రికేయులు తోట శ్రీనివాసులు, నాయబ్ రసూల్, పి.వై ఖాన్, మంద మధు స్వయంగా వారి గృహానికి వెళ్లి ఆర్థిక సహాయాన్ని అందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మిత్రుల సహాయంతో కొనసాగిస్తామని శశి కుమార్‌రెడ్డి తెలిపారు.

మట్టిని బొక్కేస్తున్నారు..

- నేతలకు మేతగా మన్ను
- జగనన్న లే అవుట్ కోసం ఒకరికి తోలిన మట్టి
- అదే మట్టిని తిరిగి రోడ్డుకు వేస్తున్న వైనం
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ఒమ్మెవరం లేఅవుట్‌లో తవ్విన మట్టి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఒమ్మెవరం గ్రామంలోని పలువురు నేతలకు మన్ను మేతగా మారింది. ఒక పర్యాయం జగన్న లే అవుట్కు తోలిని మట్టిని తిరిగి తవ్వి గ్రామంలో గ్రావెల్ రోడ్డు వేస్తున్నారు. అక్కడ గ్రావెల్‌కు ఒక పర్యాయం ప్రభుత్వం బిల్లులు చెల్లించగా, మరోసారి బిల్లులు చేసుకొనేందుకు అదే మట్టితో రోడ్డు వేస్తున్నారు. మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో జగన్న లే అవుట్‌ను గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. వాస్తవంగా అది నివాసయోగ్యం కాదని నాటి అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిసినప్పటికీ, నిధులు బొక్కేసేందుకు ఆ స్థలాన్ని ఎంపిక చేశారు. అక్కడి చౌడు భూమి సాధారణ మార్కెట్ విలువ ఎకరా రూ.4 లక్షలకు మించి ఉండదు. ఆ భూమిని రూ.12 లక్షలకు కొనుగోలు చేసినట్లు చూపారు. అలా రెండెకరాలపైనా భూమికి అధిక ధరలకు కొనుగోలు చేశారు. దీంతో అప్పట్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు రూ.12 లక్షలు చేరినట్లు వినికిడి. ఇక అదే భూమికి మెరక తోలకం పేరుతో మరిన్ని నిధులు స్వాహా చేశారు. మరో రూ.10 లక్షలు మెరకపేరుతో పక్కదారి పట్టినట్లు సమాచారం. ఇక ప్రస్తుతం ఆ లే అవుట్ గ్రామానికి దూరంగా ఉండడంతో ఎవరూ అక్కడ ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. అక్కడ ఇళ్ల స్థలాల పేరుతో 92 మంది లబ్ధిదారులను కూడా ఎంపిక చేశారు. వీరికి మరొక స్థలం ఇళ్లు కేటాయించలేదు. దీంతో వారు ఇంటి నిర్మాణం చేపట్టలేక ఖాళీ పట్టాలను ఇళ్లలో పెట్టుకున్నారు. ఇప్పుడు అక్కడి ఎర్ర గ్రావెల్ పై ఓ నేత కన్ను పడింది. గ్రామంలో రోడ్ల ఏర్పాటు పేరిట అదే గ్రావెల్ ను రోడ్లకు, ప్రైవేటు వ్యక్తులకు మేరకలకు తోలి విక్రయిస్తున్నారు. ఒక పర్యాయం బిలైన రోడ్డుకు మరోసారి బిల్లు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. దీంతో స్థానికులు ఇదేమిచోద్యం 'రామా' అంటూ నోరెళ్లబెడుతున్నారు.

లేఅవుట్లో మట్టి రోడ్డుకు తోలిన దృశ్యం

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

దీనిపై గ్రామానికి చెందిన యువనాయకుడు నల్లూరి ప్రమోద్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలించాల్సిందిగా కలెక్టరేట్ నుంచి ఎంపీడీవో కార్యాలయానికి నిర్దేశాలు అందాయి. అయితే విచారణ సక్రమంగా జరుగుతుందా..? లేక మమా అనిపిస్తారా..? అన్న చర్చ వివిధ గ్రామలలో నడుస్తుంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా శ్రీకాంత్‌ను గెలిపించాలి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపరిచిన కంచర్ల శ్రీకాంత్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. మంగళవారం పర్చూరు మండలం బోడవాడలో ఎమ్మెల్యే పర్యటించారు. నాయకులతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియను ప్రతి ఒక్కరు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును నమోదు చేయించాలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమన్నారు. నాయకులందరూ సమన్వయంతో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 7వ తేదీతో ఓటర్ నమోదు ప్రక్రియ ముగుస్తున్నందున అందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా యువతను చైతన్యం చేయాలన్నారు. మార్చిలో జరిగే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే రాష్ట్ర భవిష్యత్తుకు గీటు రాయిగా మిగిలనున్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కృషి చేశామన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులు గురి చేశాడన్నారు. రాష్ట్రంలో అరాచకం తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజలంతా ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని ఫైనల్ ఎన్నికలకు గేటు రాయిగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. ప్రజలందరూ వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి మినహా ఎక్కడ కూడా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించి చైతన్యం చేయాలన్నారు. తొలుత బోడవాడకు చెందిన కోట కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పర్చూరు మండల అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందర్రావు, సర్పంచ్ బాపూజీ, నాయకులు దొరబాబు, కృష్ణ, శ్రీధర్, హుస్సేన్, అప్పాజీ, సిరిగిరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దూడల ఉత్పత్తిని పెంచుకుంటే అధిక లాభాలు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : పశు పోషకులు పశు ఆడ దూడల ఉత్పత్తిని పెంపొదించుకున్నట్లయితే అధిక లాభాలు పెంపొందించు కోవచ్చునని జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ జె బేబీ రాణి పేర్కొన్నారు. స్థానిక పశు వైద్యశాల నందు మంగళవారం ఒంగోలు ప్రశుగణాభివృద్ధి కార్యనిర్వాణ కార్యదర్శి ఎస్ కే కాలేషా ఆధ్వర్యంలో ఆర్జీఎం పథకం క్రింద ఆడ దూడలను మాత్రమే పుట్టించే లింగ నిర్ధారిత వీర్యం కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. బేబీ రాణి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పాల ఉత్పత్తిని పెంచటానికి మంచి ఆడ దూడలను పుట్టించటం వలన పశు పోషకులు మంచి లాభాలు పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఒంగోలు ఉప సంచాలకులు ఏ రమేష్‌బాబు, బహుళార్థక ఉపసంశాలకు డాక్టర్ సోమయ్య, పశు వైద్య అధికారి ప్రతాప్‌రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ అశోక్ బాబు జన్మదినం

విశాలాంధ్ర-ఒంగోలు : శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదల అశోక్ బాబు జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఒంగోలు రైల్వే స్టేషన్ వద్ద కేక్ కటింగ్ చేసి అనాధలకు స్వీట్లు పంచిపెట్టారు. జడ్పీ కాలనీలోని శివం శరణాలయంలోని నిస్సహాయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నగరంలో రోడ్ల పక్కన నివసించే అనాధలు యాచకులు 185 మందికి విందు భోజనంతో అన్నదానం చేయడమైనది. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, ఫౌండర్ గొల్లపూడి హరి, డాక్టర్ మొగిలి దేవా, కోసూరి శ్రీదేవి, తన్నీరు సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-అద్దంకి : 18సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఓటరులుగా నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన ఓటరు నమోదుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఓటు నమోదుకు సంబంధించిన ఫారమ్ 6ను విద్యార్థులకు పంపిణీ చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి,మోహనరావు,కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఆధార్ నమోదు కేంద్రం

వృద్ధులకు ఆటోలోనే ఆధార్ సేవలు అందిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలం ఉప్పుగుండూరు గ్రామంలో 'గోపి సీ యస్ సీ' సెంటర్ నందు ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసినట్లు సీయస్‌సీ జిల్లా అధికారులు వందనం, ప్రమోద్, రఫీ తెలియజేసారు. 0-5 వయసు గల చిన్నారుల ఆధార్ నమోదు కోసం తల్లీదండ్రుల ఇక్కట్లు దృష్టా మండలంలోని గ్రామంలో చిన్నారుల ఆధార్ నమోదు వారి ఇంటి వద్దనే నమోదు చేస్తున్నట్లు ఆధార్ నిర్వాహకుడు గొర్ల గోపి తెలిపారు. ఆధార్ నమోదు, ఫోన్ నంబర్ లింకు, అడ్రాస్ అప్డేట్, మొదలగు సర్వీసు చేయబడునని తెలిపారు.

పొట్టి శ్రీరాములు త్యాగంతోనే ఆంధ్రరాష్ట్ర అవతరణ

మార్కాపురం టౌన్

కనిగిరిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

చీరాలలో మాట్లాడుతున్న ఫైరోజ్ భేగం

ఒంగోలు :

కనిగిరిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

చీరాలలో మాట్లాడుతున్న మాలకొండయ్య

సంతనూతలపాడు

శింగరాయకొండ

చీమకుర్తి

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : స్థానిక వాసవి విద్యానికేతన్‌లో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు, ఆంధ్రరాష్ట్రం అవతరణ దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్, ప్రిన్సిపల్ కె రంగయ్య పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కె రంగయ్య మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు పూర్వీకులు మన కనిగిరి ప్రాంతంవారని, నెల్లూరులో నివాసం చేసారని తెలిపారు. అలాగే మహాత్మాగాంధీకి ప్రియ శిష్యుడిగా అనేక ఉద్యమాలు, నిరాహారదీక్షలు చేశారని, హరిజనోద్ధరణకి పాటు పడ్డారని తెలిపారు. చివరగా తెలుగు వారమైన మనకు తెలుగు రాష్ట్రం ఉండాలని 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి చివరకు తన మరణాంతరం భాషాప్రయుక్త రాష్టం ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రంజిత్‌కుమార్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి వైఎస్ఆర్ భవన్‌లో మంగళవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు వైసిపి నాయకులు హాజరై జాతీయ జెండాను మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫర్, జడ్పిటిసి కస్తూరి రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పొట్టి శ్రీరాములు చిత్రపటానికికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సీనియర్ వైసీపీ నాయకులు సానికొమ్ము రంగనాయకులురెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరహరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించి అమరజీవి అయిన పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మణిక్యరావు, మోహన్ రెడ్డి, కౌన్సిలర్ దేవకి రాజీవ్, ఎస్వీఎస్ గోవర్ధన్‌రెడ్డి, పసుపులేటి అరుణోధర్, సంఘ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద గల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనిగిరి మండల ఆర్యవైశ్య సంఘం కన్వీనర్ ఐతాసుబ్బయ్య మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి కనమర్లపూడి లక్ష్మీ మోహన్, వరప్రసాద్, దర్శి సుబ్రహ్మణ్యం, విజయ మార్కండేశ్వరి దేవస్థానం అధ్యక్షులు గొంట్ల మల్లికార్జున ఇతర నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు మండల కేంద్ర మైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయురాలు ఎల్ సుజాత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వలనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని. అందువలన ఆయన ఆంధ్రుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ కే హజరత్ అలీ, మేదరమెట్ల శ్రీనివాసరావు, నరసింహారావు, ఎన్ పాల్ గాంధీ, చక్రపాణి యాదవ్, విజయనిర్మల, ప్రభావతి, శ్రీదేవి, అద్దంకి సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-చీరాల : మద్రాసు నుండి విభజించబడి దేశంలో ప్రత్యేక భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని, పొట్టి శ్రీరాములు ప్రాణర్పణ ఫలితంగా 1953 నవంబర్ 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని, ఆ మహానుభావునికి నివాళులు అర్పించడం మనందరి బాధ్యతని అసఫ్ అలీ ఉర్దు పాఠశాల హెడ్ మిస్ట్రెస్ ఫైరోజ్ భేగం అన్నారు. చీరాల అసఫ్ అలీ ఉర్దు పాఠశాలలోఆంధ్రరాష్ట్రావతరణ దినోత్సవం సందరేగా పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి అర్పించారు. ఫైరోజ్ భేగం మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు యాభై ఎనిమిది రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరులైయ్యారని అన్నారు. విద్యార్థులతో పొట్టి శ్రీరాములు వేషధారణలతో ఆయన జీవిత సందేశాన్ని విద్యార్థులకు భోదించారు.

విశాలాంధ్ర -ఒంగోలు : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తన నివాసంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర మాజీమంత్రి, వైస్సార్ కాంగ్రెస్ నాయకులు శిద్దా రాఘవరావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం, ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా మనకు నవంబర్ 1న ఆంధ్ర రాష్టం సిద్దించిందని ఆయన త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించడం జరిగిందని తెలిపారు. వారు చూపిన మార్గం మనకు ఆదర్శం అని అన్నారు.

విశాలాంధ్ర-చీరాల : మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యతని మద్రాసు రాష్ట్రం నుండి విభజించబడి ప్రత్యేక భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని చీరాల టీడీపీ ఇంచార్జి మద్దులూరి మాలకొండయ్య అన్నారు. ఆంధ్రరాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా జోరువానలో సైతం పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాలకొండయ్య మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణర్పణ ఫలితంగా 1953 నవంబర్ 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని, ఆ మహానుభావునికి నివాళులు అర్పించడం మనందరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల వేటపాలెం మండల నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గాంధీజీ పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గ్రంధి శరత్‌బాబు ఆధ్వర్యంలో పూలమాల విషయం వేసి ఘన నివాళులు అర్పించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గాంధీజీపై ఎస్సీ ఎస్టీ కమిషనర్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలను ధరించి తహసిల్దార్ ఎస్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు వెంటనే ఎస్సీ ఎస్టీ కమిషనర్ చైర్మన్ విక్టరీ ప్రసాదు క్షమాపణ చెప్పాలని కోరారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు బద్రి నారాయణ, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పాండురంగారావు ఏం సినిమా జీ డైరెక్టర్ ఎస్ సుబ్బారావు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు జి శరత్ బాబు, వివిఎన్ ప్రసాద్, జీవిఎల్ ప్రసాద్‌రావు, వి మల్లేశ్వరరావు, పి.ఆంజనేయులు, వి.చిన్నవెంకట శేషారావు, వివిఎస్ సత్య నాగమణి, వి.పాండు, వి శేషారావు, సిహెచ్ బ్రహ్మయ్య, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, కే లక్ష్మణ్, ఎన్ వి సుబ్బారావు ఎస్ ఉమ, రాము రవి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శింగరాయకొండ : రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం రైల్వేరోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ కరీమున్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు కారణమైన పోట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శరత్‌బాబు, వార్డు మెంబర్లు పాదర్థి కోటేశ్వరరావు,ఓలేటి రవిశంకర్, రవి, మండల కోఆప్షన్ సభ్యులు సర్దార్, సవలం కోటేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర- చీమకుర్తి : ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలను స్థానిక ఆర్యవైశ్య సంఘ నాయకులు మరియు రాజకీయ నాయకులు ఘనంగా నిర్వహించారు. చీమకుర్తి బస్టాండ్ సెంటర్ లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు చలువాది రమేష్ స్థానిక జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవం కోసం శ్రీ పొట్టి శ్రీరాములు గారు చేసిన పోరాటం ప్రతి తెలుగు వాడికి గర్వకారణం ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాన్ని అర్పించిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు ఆ మహనీయుని త్యాగఫలమే మన తెలుగు రాష్ట్రం ఏర్పాటు జరిగింది అని ఈ రోజు ఆ త్యాగజీవిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పాల్గొన్న వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య ఆముదాలపల్లి రామబ్రహ్మం, ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆలపాటి నరసింహారావు బీసీ నాయకులు పిన్నికి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు తాళాలు

విశాలాంధ్ర-తాళ్లూరు : నూతన భవన నిర్మాణాలు చేపట్టి సంవత్సరాలు గడుస్తున్న బిల్లులు రాకపోవడంతో ఆగ్రహించిన కాంట్రాక్టర్ గ్రామ మాజీ సర్పంచ్ గ్రామ పరిపాలన విభాగం సచివాలయానికి, రైతు భరోసా కేంద్రాలకు తాళాలు వేసి నిరసన తెలిపిన సంఘటన మండలంలోని విఠలాపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. రోజు లాగే సచివాలయ, రైతు భరోసా కేంద్రాల ఉద్యోగులు విధుల నిమిత్తం కార్యాలయానికి రాగా రెండు కార్యాలయాలకు తాళాలు వేసి ఉండడం గమనించి వెంటనే మండల స్థాయి అధికారులకు సమాచారం అందించారు. విషయం ఆరా తీయగా సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలను నిర్మించిన కాంట్రాక్టర్ గ్రామ మాజీ సర్పంచ్ అంజిరెడ్డి రెండు కార్యాలయాలకు తాళాలు వేసినట్లు తెలుసుకుని వెంటనే మండల స్థాయి అధికారులకు, మండలస్థాయి నాయకులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఎంపీడీవో కె.యుగకీర్తి మండల స్థాయి ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగి మాజీ సర్పంచ్ అంజిరెడ్డితో మాట్లాడి ఆయనను ఒప్పించారు. దీనితో కాంట్రాక్టర్ అంజిరెడ్డి తగిన హామీని పొంది తాళాలు తీశారు. సమస్య పరిష్కారం కావడంతో మండల స్థాయి అధికారులు, సచివాలయ, రైతు భరోసా కేంద్రాల ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర-తాళ్లూరు : అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగిందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పిటిసి మారం వెంకటరెడ్డి, ఎంపీడీవో కె యుగ కీర్తి తదితరులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్లాస్టిక్‌ను అంతం చేద్దాం

పర్యావరణాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర-చీమకుర్తి : ప్లాస్టిక్‌ను అంతం చేసేందుకు అందరి ప్రోత్సాహం సహకారం అవసరమని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా సూచించారు. చీమకుర్తి మున్సిపల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో యూనిసెఫ్ ఏబిబి బీ స్వచ్ఛ సర్వేక్షణ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాడ్స్, సార్డ్ హోప్ సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకంను తగ్గించే అంశంపై గోడ పత్రికను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆవిష్కరించారు. పజల నిత్య అవసరంగా మారిన ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా వాడకం నిలిపివేయాలని ఇప్పటికే అనేక మార్గాల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామని ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించేందుకు చర్యలు చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాష్ ప్రోగ్రాం ఫెసిలియేటర్ సిహెచ్ వెంకట పద్మావతి మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలో వరి పంట వివిధ దశలలో ఉందని ఈ క్రమంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని దీనివల్ల నష్టాలు కలగకుండా లాభాలు చేకూరుతాయని మండల వ్యవసాయ అధికారి బి.ప్రసాదరావు అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని విఠలాపురం గ్రామంలో పర్యటించి వరి పంట పొలాలను పరిశీలించారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్లో భాగంగా 4476 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారని ఆయన తెలిపారు. వ వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ, యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి నాగరాజు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

అయ్యప్పను ఊరేగిస్తున్న వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముండ్లమూరులో శబరిగిరి సురుడు అయ్యప్ప స్వామి పడిపూజ అత్యంత వైభవంగా మంగళవారం నిర్వహించారు. ముండ్లమూరు గ్రామంలో గల సోమేపల్లి వెంకటేశ్వర్లు అనురాధ దంపతులు ఇంటి వద్ద అయ్యప్ప మాల ధరించిన స్వాములకు అయ్యప్ప పడి ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పీఠం వద్ద అయ్యప్ప, విగ్నేశ్వరుడు, కుమారస్వామి, శివయ్య, దుర్గామాత అమ్మవారు, చిత్రపటాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు అయ్యప్ప స్వామిని ఊరేగింపు చేశారు. అయ్యప్ప స్వామికి స్వాములతో పాటు ప్రజలు హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమం గురు స్వామి కంకణాల చలపతిరావు ఆధ్వర్యంలో జరిగింది. అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం మారుమరోగింది. ఈ కార్యక్రమంలో మందలపు వేణు గోపాలకృష్ణస్వామి, బేతపూడి శివలక్షణరావు స్వామి, అంబటి వెంకటేశ్వర రెడ్డి స్వామి, వీరపనేని పవన్ కుమార్ స్వామి, నరసింహారెడ్డి స్వామి, సోమశేఖర్‌రెడ్డి స్వామి, నన్నం రామకృష్ణ స్వామి, తొట్టెంపూడి ఆదిశేషు స్వామి తదితర స్వాములు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్సై దాసరి ప్రసాద్, రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత గూడూరి రాజేంద్ర బాబు మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనంగా ఉంటే ఉన్నత స్థితికి చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్ణయించుకొని దాన్ని చేరేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, పీసీ పల్లి మండల కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కాసిం పీరా, అధ్యాపకులు జే సురేష్‌రెడ్డి, బి గురవయ్య, బి పద్మజ, బి రవీంద్ర, ఏ హనుమంతరావు, కే సురేష్, వి రామరాజు, నాగమణి, ఎన్ యేసయ్య, పి గురవమ్మ, కె రామ్మోహన్‌రావు, ఎస్‌కె కోటి సాహెబ్, ఉమా జయశ్రీ, సుబ్బరాయుడు సాయి, సుజాత, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ సమీక్ష

విశాలాంధ్ర-సీఎస్‌పురం : శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియపై అధికారులు వైసీపీ నాయకులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల పరిషత్ అధ్యక్షులు మూడమంచు వెంకటేశ్వర్లు కోరారు. గ్రాడ్యుటి ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కోవిలంపాడు సచివాలయంలో మంగళవారం సమీక్షా సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శాసనమండలి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా శ్యాంప్రసాద్‌రెడ్డిని ప్రకటించారని కావున మండలంలోని అన్ని గ్రామాల్లో పట్టభద్రులను గుర్తించి స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు సమిష్టిగా గ్రామాల్లో గ్రాడ్యుటి పూర్తి చేసిన వారికి ఓటరుగా దరఖాస్తులు పూర్తి చేసి మండల తహశీల్దారు కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు. లేని పక్షంలో తనకు అందజేయాలని ఆయన కోరారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలం ప్రథమ స్థానంలో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కోవిలంపాడు సర్పంచి షేక్ ఖాదర్‌బి బుజ్జి, ఉప సర్పంచి టి బాబురావు, మండల కో ఆప్షన్ పఠాన్ మాబు, బోయమడుగుల ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, వైయస్ఆర్ సీపీ మండల యువత పార్టీ అధ్యక్షులు ఎం అటేలయ్య, వైసీపీ నాయకులు మురార్జి, కె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మారుమోగిన భైరవకోన

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన పర్యాటక కేంద్రమైన శైవక్షేత్రమైన భైరవకోనలో శివనామస్మరణతో మారుమ్రోగిపోయింది. మంగళవారం కోటి సోమవారం కావడంతో భైరవకోనలో త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని, కాళభైరవేశ్వరస్వామిని, సంఘమేశ్వరస్వాములకు పంచామృత అభిషేకాలను అర్చకులు నిర్వహించి విశేష అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ముక్కోటి సోమవారం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున భైరవకోన చేరుకొని జలపాతం వద్ద స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించి త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. భైరవకోనకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఈఓ నర్రా నారాయణరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి పర్యవేక్షించారు.

విధుల్లో అలసత్వం వద్దు

మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీనివాస విశ్వనాథ్

విశాలాంధ్ర-వెలిగండ్ల : సచివాలయ సిబ్బంది విధులలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రత్యేక అధికారి శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని రామలింగాపురం ఆర్జిపురం సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న 542 సేవలకు గాను కొన్ని సేవలు మాత్రమే ప్రజల వద్దకు చేరుతున్నాయని ఇందులో సచివాలయ సిబ్బంది పాత్ర చాలా ప్రాముఖ్యతతో కూడుకుందని విధులలో అలసత్వం వహించరాదని ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలందరికీ అందే విధంగా చూసుకోవాలని సూచించారు. ఇల్లు నిర్మాణాలు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లబ్ధిదారులను ఆ వైపుగా సన్నద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాతపూడి సుకుమార్ సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో మొండి వైఖరి సరికాదు

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మొండి వైఖరి ప్రదర్శిస్తున్నారని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు వడ్డే బాలయ్య ఆరోపించారు. హాస్పటల్లో సిబ్బంది కొరత ఉన్న భర్తీ చేయడంలో సూపరిండెంట్ అలసత్వం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులకు సంబంధించిన 26 సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఉద్యోగులు తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ హాస్పటల్లో సిబ్బంది కొరత ఉందని డాక్టర్ ప్రభావతికి ఎన్నిమార్లు చెప్పిన పట్టించుకోకపోవడం దారుణమన్నారు. హాస్పటల్లో పెరుగుతున్న పేషంట్ల కోసం బెడ్లు, డాక్టర్స్, నర్సులను భర్తీ చేస్తున్నారే గానీ కిందిస్థాయి సిబ్బందిని మాత్రం భర్తీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాబ్, రేడియోగ్రాఫర్, ఎక్సరే డిపార్ట్‌మెంట్ సిబ్బందిని, ఫార్మా సిబ్బందిని, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్ఓలను నియమించి సిబ్బందిపై ఉన్న భారాన్ని తొలగించాలన్నారు.

బానిస బతుకులు మానుకోండి

- జగన్ రెడ్డి వేసే బిస్కెట్లు కోసం ఆశపడొద్దు
- రానున్న రోజుల్లో చరిత్ర హీనులవుతారు
- జనసేన ప్రకాశం జిల్లా కార్యదర్శి కళ్యాణ్ ముత్యాల ధ్వజం

విశాలాంధ్ర-ఒంగోలు : వైస్సార్సీపీ కాపు నాయకులు జగన్ పాదయాత్ర సందర్భంగా కాపులకు ఇచ్చిన హామీలు అమలు చేసేలా వత్తిడి తేవాలని జనసేన జిల్లా కార్యదర్శి కళ్యాణ్ ముత్యాల ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాపు జాతి అభివృద్ధి మరచి జగన్ వద్ద బానిసలుగా మారి జనసెన అధినేత పవన్ కళ్యాణ్ మీద ఆరోపణలు చేయటమే లక్ష్యం గా పనిచేయటం వైసీపీ కాపు నేతలు సిగ్గు పడాల్సిన విషయమని ధ్వజమెత్తారు. అధికారం లోకి రాగానే కాపులకు న్యాయం చేస్తాను అని చెప్పి దగా చేసింది వాళ్ళ నాయకుడు జగన్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు.దేశంలో ఆర్థికంగా వెనుబడిన అగ్రకులాలకు కేంద్ర ఇచ్చిన 10శాతం రిజర్వేషన్‌లో ఏపీలో అత్యధికంగా ఉన్న కాపులకు 5శాతం రిజర్వేషన్ ఇవ్వాలని గత టీడీపీ ప్రభుత్వంలో శాసనసభలో తీర్మానం చేస్తే ఆవిషయాన్ని తుంగలో తొక్కింది మీ నాయకుడే కదా అన్నారు అలానే మీ నాయకుడు అధికారంలోకి రాగానే కాపు కార్పొరేషన్ కి సంవత్సరానికి రూ.2వేల కోట్లు ఇస్తాను అని చెప్పి, ప్రభుత్వం ఏర్పడి 3ఏళ్ళు గడుస్తుంది మీరు కాపు కార్పొరేషన్ కి ఎంత విడుదల చేసారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బీసీ లకు అన్యాయం జరగకుండా కాపులను బీసీ చేర్చే ప్రయత్నం చేస్తా అన్నారు అది ఎంతవరకు వచ్చిందో తెలిపి మీ నాయకుడిని అడిగి కాపులకు న్యాయం చేయవలసినదిగా కోరుకుంటున్నామన్నారు. అలానే విదేశీ విద్యాదీవెన రాక ఎంత మంది కాపు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారో వైసీపీ కాపు నాయకులకు తెలుసా అని ప్రశ్నించారు.ముందు కాపులకు ఇచ్చిన హామీలు నెరవేర్చమని మీ నాయకుడికి చెప్పండి, అంతే కానీ దేవుడు నోరు ఇచ్చాడు కదా అని వాగుతూ ఉంటే రానున్న రోజుల్లో కాపులు అందరూ కలిసి మీకు రాజకీయ చరమ గీతం పాడుతారని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ గారు చెప్పింది ఒకటే బానిసత్వం వదిలి కాపుల అభివృద్ధికి పాటుపడండి అని అన్నారు,ఇప్పటికైనా మీ నాయకుడి మీద ఒత్తిడి తెచ్చి కాపులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అలా కాకుండా కాపు జాతికి అన్యాయం చేస్తే, రానున్న రోజుల్లో ప్రభుత్వం తీవ్రపరిణామాలు ఎదురుకోవాలిసి వస్తుంది హెచ్చరించారు.

ప్రమాదాలు నివారణకు ఎంపీపీ చొరవ

చిల్లచెట్లు తొలగిస్తున్న ఎంపీపీ

విశాలాంధ్ర-తాళ్లూరు : అది ఆర్ అండ్ బి రహదారి. రోడ్డుకు ఇరువైపులా గుబురుగా చిల్లచెట్లు పెరిగిపోవడంతో రహదారి సక్రమంగా కనిపించక పోవడం వల్ల అనేక పర్యాయాలు ప్రమాదాలు జరుగుతున్న వైనాన్ని గమనించి ప్రమాదాలను నివారించాలనే సంకల్పంతో స్వయంగా తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు చొరవ తీసుకున్నారు. మండల కేంద్రమైన తాళ్లూరు నుండి తూర్పు గంగవరం వెళ్లే ఆర్ అండ్ బి రహదారి కొత్తపాలెం, మాధవరం మధ్య పలు మలుపులు, అక్కడే గుబురుగా పెరిగిన చిల్ల చెట్లను గమనించి ప్రమాదాలను నివారించాలననే ఉద్దేశంతో స్వయంగా కూలీలను ఏర్పాటు చేసి మంగళవారం చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. తాను దగ్గరుండి చెట్లను తొలగించడంలో తగిన సూచనలు ఇస్తూ రహదారి కిరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా చెట్లను తొలగించి వాహనదారులు ప్రమాదాల నుండి బయట పడడానికి కృషి చేసిన ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావును పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాధవరం వైసీపీ నాయకులు జయరామిరెడ్డి, కూలీలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఆదానీ ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తున్న సీఎం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రాష్ట్రంలోని మౌలిక వనరులు, విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో, పోర్టులను ఆదానికి అప్పగించి సిఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అదానీ ఆంధ్రప్రదేశ్ మారుస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు సుందరయ్య భవన్లో మంగళవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రం దేశానికి ఆదర్శమని ప్రగల్భాలు పలికిన ప్రధాని మోడీ తీగల వంతెన కూలటంతో గుజరాత్ అభివ ృద్ధి బుడగ పేలిపోయిందన్నారు. గుజరాత్లోని మోర్బీ నగరంలో మచ్చు నదిపై బ్రిటీష్ పాలన కాలం నాటి ఓ తీగల వంతెన కూలటంతో 137 మంది మరణించారని, మరో 100 మంది గల్లంతయ్యారన్నారు. మరో 1500 మంది క్షతగాత్రులు గుజరాత్లోని ఓ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారన్నారు. హాస్పిటల్ అధ్వాన్నంగా ఉందని, ప్రధాని పర్యటన సందర్భంగా హాస్పిటల్కు రంగులు వేసి ముస్తాబు చేశారని, ప్రధాని డ్రామా కంపెనీ నడుపుతున్నారన్నారు. 50 ఏళ్ళ నాటి బ్రిడ్జికి మరమ్మతుల కాంట్రాక్ట్ ఎలాంటి అనుభవం లేని కంపెనీకి ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. 150 మంది తిరిగే వంతెన 500 మందికి అవకాశం ఇచ్చి టిక్కెట్లు అమ్ముకున్నారు. బ్రిడ్జి కూలిన తరువాత ముందస్తు చర్యలు చేపట్టలేదన్నారు. ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నెల్లూరు కృష్ణ పట్నం పోర్టు, గంగవరం పోర్టు, విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోను ఆదానీకి అప్పగించారని, సిఎం అదానీ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో విద్యా రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. దివాళా తీస్తున్న బైజూస్ కంపెనీకి విద్యా వ్యవస్థను అప్పగించి సిఎం ప్రచార కర్తగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలతో పేద విద్యార్థులను విద్యను దూరం చేస్తున్నారని విమర్శించారు. 4-10 తరగతి విద్యార్థులకు ప్రభుత్వం స్మార్ట్ ఫోన్లు ఇవ్వాలని కోరుతున్నారని, ఆన్లైన్లో పాఠాలు చెబుతామని ఆ కంపెనీ చెబుతుందన్నారు. విద్యా వ్యవస్థపై దాడిని ప్రజలు తిప్పికొట్టాలని, పాడి పరిశ్రమను అమూల్ సంస్థకు అప్పగించారని ఎద్దేవా చేశారు. ప్రకాశం జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన వెలుగొండ ప్రాజెక్టను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం సంక్రాంతికి ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెబితే వైసిపి ప్రభుత్వం ఉగాదికి పూర్తి చేస్తామని చెబుతుందన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్వాసితులకు పరిహారం ఇచ్చి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అలసత్వం వీడి వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయకపోతే మరోసారి ఉద్యమానికి సిపిఎం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. ఉచితవిద్యుత్ ఇస్తున్నప్పుడు నాణ్యమైన విద్యుత్ ఎలా ఇస్తారని మంత్రి పెద్దిరెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణలో మోటార్లకు మీటర్లు ప్రతిపాదనను ప్రభుత్వం వ్యతిరేకించిందన్నారు. అదేవిధంగా పంచాయతీలపై ప్రభుత్వం పక్షపాత వైఖరి విడనాడాలని, పంచాయతీలకు నిధులు విడుదల చేయాలన్నారు. సర్పంచ్లు నిధుల కోసం రోడ్డెక్కుతున్నారని, 15 ఆర్థిక సంఘం నిధులలో 40 శాతం పంచాయతీలకు కేటాయించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ జిల్లా భూ బకాసురులు పెరిగారని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారన్నారు. ఆ సైస్మెంట్ కమిట్లు ఎత్తివేశారని, కనిగిరి, పామూరు, హెచ్ఎంపాడు మండలాలలో అసైన్మెంట్ భూములు కబ్జాకు గురయ్యారన్నారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో త్రిపురాంతకంలో హత్య జరిగిందన్నారు. కలెక్టర్ స్పందించి భూ దోపిడీని నివారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్ నివారణకు చర్యలు

విశాలాంధ్ర-గిద్దలూరు : ముండ్లపాడు గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవస్థానం దగ్గర కొందరు కుర్రాళ్ళు స్థానిక గంజి భద్రయ్య మెమోరియల్ హై స్కూల్ బాలికలపై కామెంట్స్ చేస్తూ, వారితో అసభ్య రీతిలో ప్రవర్తిస్తున్నారని బాధిత బాలికల తల్లిదండ్రుల నుండి గిద్దలూరు పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదులు అందాయి. స్థానిక సచివాలయం మహిళా పోలీస్ పావని ఈవ్ టీజింగ్ నివారణకు ప్రయత్నం చేసినా ఆమెను లెక్కచేయని ఆకతాయిలు ఇలాంటి సంఘటనలు గత కొన్ని రోజుల నుండి జరుగుతున్నాయి అని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఈ విషయం పై స్పందించిన ఎస్ఐ మహేష్ తన సిబ్బందితో ముండ్లపాడు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థానం సెంటర్ నందు పరిశీలన చేసి చుట్టు ప్రక్కల షాపులు నిర్వహిస్తున్న వారిని, అలాగే ఆ ప్రాంతంలో ఉండే గ్రామస్థులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈవ్ టీజింగ్ చేస్తే ఖచ్చితంగా కేసులు కడతామని ఎవరి సిఫారసులను అంగీకరించమని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్రయాణికులు కాకుండా వేరే ఎవరైనా అల్లరి చేసేలా ఉంటే చర్యలు తీసుకోవడానికి ఉపేక్షించమని తెలిపారు. అలాగే కొందరు దుకాణదారులు తమ షాపులల్లో మద్యం తాగిస్తున్నారని కంప్లైంట్స్ ఉన్నాయని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే దేవస్థానం సెంటర్‌లో సిసి కెమెరాను ఏర్పాటు చేసేలా చూడాలని పంచాయతీ వైస్ ప్రెసిడెంట్‌ని కోరారు. ఎస్ఐ మహేష్ తన సిబ్బందితో గంజి భద్రయ్య హై స్కూల్ ను సందర్శించి హెడ్ మాస్టర్ గిరిధర్ శర్మను కలిసి ఈవ్ టీజింగ్ నివారణకు ఎల్లవేలల అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముండ్లపాడు పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ కడియం శేషగిరిరావు, మహిళా ఏఎస్ఐ ఎం నాగలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి, కానిస్టేబుల్ నాయబ్ రసూల్, సచివాలయం మహిళా పోలీస్ పావని, చిలకల ప్రతాప్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గిద్దలూరు : స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు మంగళవారం సబ్ రిజిస్టర్ పి.ఐజాక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ రిజిస్టర్ మాట్లాడుతూ విక్రయ దస్తావేజులు, దాన సెటిల్మెంట్లు, జనరల్ పవర్‌తో కూడిన క్రయ ఖరారులు, జనరల్ పవర్‌తో కూడిన డెవలప్మెంట్ ఖరారులు, తనఖాలు, పార్టీషన్లు, హక్కు విడుదల, కౌలు దస్తావేజులు, వీలు నామాలు, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ, దత్తత స్వీకారములు, ట్రస్ట్ దస్తావేజులు మరియు ఇతర దస్తావేజుల గురించి ప్రజలకు అవగాహన సదస్సును కల్పించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రజలు, సబ్ రిజిస్టర్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

'బాదుడే బాదుడు'

విశాలాంధ్ర-పెదకాకాని : అసత్యాల పునాదుల మీద, అరాచక శక్తులతో నిర్మితమై కల్పిత ఆరోపణలు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడున్నార సంవత్సరాలగా నిత్యావసర వస్తువుల ధరలు, ఉద్యోగ, వ్యాపార, ఉపాధి, వ్యవసాయ రంగాలు కూదేలవ్వటమే కాక, ప్రభుత్వం అధిక పన్నులతో పేదలను వేదిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఖరికి నిరసనగా పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామ తెలుగుదేశం పార్టీ మంగళవారం సాయంత్రం చేపట్టిన బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమములో పాల్గొన్న టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఆర్థిక ఇబ్బందులు అభివృద్ధి లేమిలతో ఇక్కట్లు పడుతున్న ప్రజలను ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల, గ్రామ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అనుబంధ కమిటీ నాయకులు ఉన్నారు.

ఏపీఎంలు బాధ్యతగా పనిచేయాలి

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టేలా ఏపీఎంలు బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. సెర్ప్‌లో పనిచేస్తున్న ఏపీఎంలను విద్యా శాఖకు బదలాయించిన నేపథ్యంలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం బాపట్ల జిల్లాలోని విత్తనాభివృద్ధి సంస్థ శిక్షణా కేంద్రంలో మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఏపీఎంలకు పలు సూచనలు చేశారు. విద్యాశాఖ కార్యక్రమాలపై ఏపీఎంలు పూర్తి స్థాయిలో పరిజ్ఞానం పెంపొందించుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న నాడు-నేడు కార్యక్రమాలపై పర్యవేక్షణ పెరగాలన్నారు. పెద్ద ఎత్తున చేపడుతున్న నిధుల వినియోగం, అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా ఉండేలా చూడాలన్నారు. భావితరాలకు ఎంతో ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో నాడు-నేడు కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సమర్థంగా చేపడుతున్నారని వివరించారు. విద్యా సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ప్రయోజనం కల్పిస్తాయన్నారు. విద్య హక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం చక్కటి కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఒక్కొక్క విద్యార్థిపై ప్రతి ఏటా రూ.30,000లు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. మంచి విద్య అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇలాంటి బృహత్తరమైన కార్యక్రమాన్ని పర్యవేక్షించే అవకాశం ఏపీఎంలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం శుభ పరిణామమన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేలా ఏపిఎంలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మండల విద్యాశాఖ అధికారులు, రిసోర్స్ పర్సన్‌లతో సంయుక్తంగా పనిచేయాలని ఆయన పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలతో విద్యా వ్యవస్థకు మంచి రోజులు వచ్చాయన్నారు. మా కోసం, భావి తరాల కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతుందనే విషయం ప్రతి తల్లిదండ్రుల్లో కల్పించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్జెడి ఎస్ సుబ్బారావు, బాపట్ల డీఆర్డిఏ పిడి అర్జున్‌రావు, ప్రకాశం, బాపట్ల జిల్లాల ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఎంపీ

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్ : జిల్లాలో వ్యవసాయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా సమీక్షా సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మర్కొండా రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో గత అజెండా అంశాలపై తీసుకున్న చర్యలను జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులకు వివరించారు. గతంలో రైతులు, సలహా మండలి సూచించిన విధంగా నర్సరీ సాగుకు సంభందించి, సబ్సిడీపై పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 30 ఎకరాలు దరఖాస్తు చేసుకున్న వారిలో 16 ఎకరాలకు గ్రౌండింగ్ పూర్తి చేసినట్లు ఉద్యాన శాఖ అధికారి తెలిపారు. మరింత మంది రైతులను నర్సరీలను అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేయాలనీ ప్రజాప్రతినిధులు సూచించారు.

వినికిడి మిషన్ బహూకరణ

వినికిడి మిషన్ను అందజేస్తున్న మన్నం వెంకయ్య

విశాలాంధ్ర-సింగరాయకొండ రూరల్ : సింగరాయకొండ మండల కలికివాయి గ్రామానికి చెందిన దాసరి పెదమాల కొండయ్యకు మంగళవారం కలికివాయ గ్రామంలో మన్నం వెంకయ్య చేతులమీదుగా వినికిడి మిషన్ని అందజేయడం జరిగింది. అతను గత కొన్ని సంవత్సరాల నుంచి ఎదుట వారు చెప్పే మాటలు వినపడక నిత్యం అనేక ఇబ్బందులకు గురౌతున్న నేపథ్యంలో కొండపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఇంచార్జి వరికూటి అశోక్ బాబు దృష్టికి కలికివాయి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు గుండపురెడ్డి శ్రీహరిరెడ్డి బాధితుడి విషయం అశోక్‌బాబుకి తెలియ పరచగా వెంటనే స్పందించి ఒంగోల్లో నివాసముంటున్న మన్నం వెంకయ్య దృష్టికి తీసుకెళ్లగా వెంటనే వెనువెంటనే దాసరి పెదమాల కొండయ్యకి వినికిడి మిషన్ని కలికివాయి గ్రామానికి వచ్చి మన్నం వెంకయ్య వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఉచితంగా బహూకరించారు. దాసరి వెంకటేశ్వర్లు, కోనపురెడ్డి శివ, గుండపురెడ్డి శ్రీహరిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని అశోక్ బాబుకు, మన్నం వెంకయ్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి ఆచూకీ తెలపండి

విశాలాంధ్ర-కొమరోలు : ద్వారకచర్ల గ్రామానికి చెందిన బొడ్డు రంగమ్మనే వృద్ధురాలు ఆచూకీ తెలపాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. గత నెల 30వ తేదీ ఉదయం నుంచి కనిపించడం లేదని రంగమ్మకు మతిస్థిమితం అంతంత మాత్రమే ఉందని కుటుంబ సభ్యులు చెప్పారు. ఎవరైనా ఈమె తెలిసి ఉన్న లేదా గుర్తించిన 9907097439, 9179545232 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.